క్లుప్తంగా

నేడు మెడిటేషన్ డే

తిరుమలాయపాలెం: వరల్డ్ మెడిటేషన్ డే సందర్భంగా మండలంలోని పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఖమ్మం యూనిట్, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యాన శనివారం ఉదయం 11 గంటలకు కళాశాలలో జరిగే వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు మిలీనియంలో నాలెడ్జ్ ఫెయిర్

ఖమ్మంసహకారనగర్: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు గాను తమ పాఠశాలలో శనివారం నాలెడ్జ్ ఫెయిర్–2024 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మిలీనియం హైస్కూల్ కరస్పాండెంట్ జాహెద్ అలీ, ప్రిన్సిపాల్ గోహర్ తబుసమ్‌లు తెలిపారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నర్సరీ నుంచి 9వ తరగతి విద్యార్థులంతా వారిలో ఉన్న నైపుణ్యాలను వెలికితీసేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈఓ సోమశేఖర శర్మ, ఖమ్మం అర్బన్ ఎంఈఓ శైలజ లక్ష్మి లు హాజరుకానున్నారన్నారు.

27లోగా దరఖాస్తు చేసుకోండి

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ (ఎఫ్.పీ.సీ)లో ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ)గా తాత్కాలిక పద్ధతిన పనిచేయుటకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ చైర్మన్ గోవింద కవిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తింపు పొందిన విద్యాసంస్థల నుంచి అగ్రికల్చర్ గ్రాడ్యుయేట్, అగ్రికల్చర్ మార్కెటింగ్, అగ్రికల్చర్ బిజినెస్ మేనేజ్‌మెంట్, అగ్రికల్చర్ డిప్లొమా, తత్సమాన అర్హత కలిగి కంప్యూటర్ పరిజ్ఞానం, ఒక సంవత్సరం వ్యవసాయ సంబంధిత పనిపై అనుభవం కలిగిన వారు అర్హులన్నారు. ఎఫ్‌పీసీలో షేర్ కలిగిన మహిళా వాటాదారులు, ఎస్‌హెచ్‌జీ సభ్యులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నామని, అర్హులు ఈ నెల 27లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం దరఖాస్తులను పరిశీలించి మౌఖిక పరీక్ష ద్వారా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

ధ్యాన శిక్షణా కార్యక్రమాలు ప్రారంభం

కూసుమంచి: కూసుమంచిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధర్యాన మూడు రోజుల పాటు నిర్వహించనున్న ధ్యాన, యోగా శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం మాజీ సర్పంచ్ చెన్నా మోహన్, శిక్షణా కోఆర్డినేటర్ టి.నర్సింహాచారి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి ఉరుకులు, పరుగుల జీవనంలో మనిషికి కొంత మానసిక ప్రశాంతత అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ధ్యానం, యోగా విశిష్టతలను వివరించారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు నరేందర్, అనురాధ, కరుణాకర్, రాజేంద్రప్రసాద్, కవిత, జ్యోతి, అరుణ, మోహన్, మురళి పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీకి పురస్కారం

రఘునాథపాలెం: రఘునాథపాలెం తాజా మాజీ జెడ్పీటీసీ మాలోత్ ప్రియాంకను డెమోక్రటిక్ సంఘం 'చేంజ్ మేకర్' పురస్కారంతో ఘనంగా సత్కరించింది. హైదరాబాద్ తాజ్‌ఫలక్‌నామా ప్యాలెస్‌లో గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో మాజీ విశ్వసుందరి సుస్మితాసేన్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈమేరకు తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రియాంక కృతజ్ఞతలు తెలిపారు.



ప్రియాంక

దేవాలయ నూతన కమిటీ ప్రమాణస్వీకారం

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ పాలకవర్గం శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. చైర్మన్‌గా శ్రీదేవి, సభ్యులుగా మధుర, నాగమణి, పుష్పావతి, తేజశ్రీలు నియమితులు కాగా దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ వారిచే ప్రమాణాస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, దేవాలయం ఈఓ కె.శ్రీకాంత్, అర్చకులు హరిప్రసాద్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	పుష్ప 2
వినోద	ముఫాసా
సాయిరాం	విడుదల పార్ట్ 2
ఆదిత్య	పుష్ప 2
శ్రీనివాస	బచ్చలమల్లి
సినీగెలాక్సీ	యూఐ

– ఖమ్మంగాంధీచౌక్

అక్కడ ఆయాలే అంతా..!



శివాయిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పర్యవేక్షణలో చిన్నారులు

అంగన్‌వాడీల్లో టీచర్లు కరువు

- రెండేళ్లుగా ఆయాలతోనే నెట్టుకొస్తున్న వైనం
- మూడు కేంద్రాల్లో భర్తీకాని ఖాళీలు
- కుంటుపడుతున్న చిన్నారుల ప్రగతి
- పట్టించుకోని అధికారులు

రఘునాథపాలెం: చిన్నారులకు విద్యా బుద్ధులతో పాటు అక్షరాలు, క్రమశిక్షణ వంటి లక్షణాలను నేర్పించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యాన కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో సరిపడా సిబ్బంది లేకపోవడంతో ప్రభుత్వ లక్ష్యాలు నీరుగారుతున్నాయి. ఖాళీ పోస్టుల భర్తీలో ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండడంతో విద్యార్థుల ప్రగతి ప్రశ్నార్థకంగా మారుతుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

తల్లిదండ్రుల అనాసక్తి..

ఆయాలు అంగన్‌వాడీ కేంద్రాలను కొనసాగిస్తుంటే వాటి సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడంతో వారు ఏడాది పాటు నెట్టుకొస్తున్నారు. టీచర్లు లేకపోవడంతో కేంద్రాలకు చిన్నారులను పంపించేందుకు తల్లిదండ్రులు సైతం అనాసక్తిగానే పంపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ల పోస్టులను భర్తీ చేసి చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పేలా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై సూపర్‌వైజర్లు వెంకటమ్మ, వెంకటలక్ష్మిలను వివరణ కోరగా.. పదోన్నతిలో రెండు చోట్ల, మృతి చెందడంతో మరో చోట ఖాళీ అయినట్లు చెప్పారు. భర్తీ చేస్తే తప్ప చిన్నారుల పరగతి మెరుగుపడుతుంది లేదంటే అక్కడ ఆయాలతోనే నడిపించాల్సి వస్తుందన్నారు.

రెండేళ్లుగా ఆయాలతోనే..

మండలంలోని శివాయిగూడెం, జేకే బంజర, వీవీపాలెం పంచాయతీలోని జగ్యాతండా అంగన్‌వాడీ కేంద్రాలకు టీచర్ లేకపోవడంతో రెండేళ్లుగా ఆయాలే టీచర్లుగా కొనసాగుతూ నెట్టుకొస్తున్నారు. ఇందులో శివాయిగూడెం, జేకే బంజర అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లకు గత రెండేళ్ల క్రితం సూపర్‌వైజర్లుగా పదోన్నతి రావడంతో అక్కడ నుంచి బదిలీపై వెళ్లారు. నాటి నుంచి అంగన్‌వాడీ టీచర్లను నియమించలేదు. ఆ కేంద్రాల్లో ఆయాలే వంట వండి వడ్డించడంతో పాటు గర్భిణులకు గుడ్లు, ఇతర సామగ్రి అందించే పనులు చేస్తున్నారు. అదేవిధంగా మండలంలోని వీవీపాలెం పంచాయతీలోని జగ్యాతండా కేంద్రం టీచర్ గత మార్చిలో మృతి చెందడంతో అక్కడ ఆయాతోనే కొనసాగిస్తున్నారు. ప్రతీ రోజు ఆయాలు వండి.. వడ్డించడం తప్ప అక్షరం, ఆరోగ్యం, క్రమశిక్షణ, బుద్ధులు నేర్పే వారు లేక బడి ఈడు వచ్చిన తర్వాత ఆ విద్యార్థులకు కనీసం జ్ఞానం లేకుండా పోతుందని ఆయా ప్రాంతాల్లోని పాఠశాల ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ప్రజలకు సేవే చేయడమే అభిమతం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి

నేలకొండపల్లి: ప్రస్తుత రాజకీయ నాయకుల మాటలను ప్రజలు అసహించుకుంటున్నారని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పలు కుటుంబాలను పర్యటించిన ఆయన నేలకొండపల్లిలో నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించాక మాట్లాడారు. ఇప్పటివరకు తానెవరినీ కించపరిచేలా మాట్లాడలేదని.. తన విషయంలోనూ ఎవరూ అలా వ్యవహరించలేదని తెలిపారు. ఎన్నికల వరకే రాజకీయాలు చేయడం, ఆతర్వాత ప్రజలకు సేవే చేయటమే తన అభిమతమని చెప్పారు. తన సొంత డబ్బులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని, 2009లోనే రూ.80 లక్షలను పనులకు వెచ్చించానని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య, నాయకులు వెన్నబోయిన శ్రీనివాసరావు, నంబూరి సత్యనారాయణ, మరికంటి రేణుబాబు, కమదన ప్రవీణ్, చెరువు నరసింహారావు, శీలం వెంకటలక్ష్మి, కొండా కనకప్రసాద్, మాదాసు ఆదాం, నేరళ్ల నరసింహారావు, ఎర్రా కోటి, తెల్లగొర్ల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు స్కూల్ ప్రవేశ్ మాడ్యూల్ పరీక్ష

ఖమ్మం అర్బన్: స్కూల్ ప్రవేశ్ మాడ్యూలు(ఎస్‌పీఎం) టెస్టును శుక్రవారం నగరంలోని ఇందిరానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మల్లెమడుగు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించినట్లు అకాడమిక్ మానిటరింగ్ అధికారి రవికుమార్ తెలిపారు. ఎన్‌సీఈఆర్‌టీ, న్యూఢిల్లీ బృందం బాధ్యులు ప్రొఫెసర్ టి.కొండలు ఆధ్వర్యాన పరీక్ష నిర్వహిస్తుండగా.. ప్రతీ పాఠశాల నుంచి 8 మంది చొప్పున 1వ తరగతి విద్యార్థులకు అందించిన కిట్స్ ఆధారంగా పరీక్షను నిర్వహించామన్నారు. ఈక్రమంలో ప్రతీ పాఠశాల నుంచి ఒకటో తరగతి బోధిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను కూడా పాఠశాల విద్యాప్రవేశ్ మాడ్యూల్ వినియోగంపై, బోధనలో ఎదురవుతున్న సమస్యలపై ఇంటర్వ్యూ నిర్వహించి వారి స్పందనలను నమోదు చేశారన్నారు. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా ఉపాధ్యాయులు జీవన్, రవిలు వ్యవహరించగా.. కార్యక్రమంలో ఖమ్మం అర్బన్ ఎంఈఓ శైలజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ఇన్ఫోసిస్' సందర్శన

ఖమ్మం సహకారనగర్: హైదరాబాద్ పోచారంలోని ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ ఇన్ఫోసిస్‌ను తమ కళాశాల మొదటి సంవత్సర విద్యార్థులు శుక్రవారం సందర్శించారని ఎస్‌బీఐటీ చైర్మన్ గుండాల కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్‌వేర్ రంగంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో తీసుకురాగా తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్), ఇన్ఫోసిస్ వారి సంయుక్త ఆధ్వర్యాన ఈ అవకాశం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్ఫోసిస్ సంస్థ రిలేషన్‌షిప్ మేనేజర్ నివాస్, సిగ్రమాన్‌తో పాటు కళాశాల అకడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఏవీవీ శివప్రసాద్, జె.రవీంద్రబాబు, ఎస్.శ్రీనివాసరావు, టీపీఓ సవిత, కోఆర్డినేటర్ జి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

'త్రివేణి'లో కొనసాగుతున్న మ్యాథ్స్ ఫెస్ట్



మ్యాథ్స్ డే ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని గత రెండు రోజులుగా నగరంలోని త్రివేణి పాఠశాలలో మ్యాథ్స్‌ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల డైరెక్టర్లు గొల్లపూడి వీరేంద్ర చౌదరి, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్‌లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్‌కు సంబంధించిన అంశాలపై వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. త్రివేణి–కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, వివిధ విభాగాల ఇన్‌చార్జ్‌లు మురళీకృష్ణ, స్వప్న, ముస్తఫా, చార్లెస్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో సికెల్ సెల్ పరీక్షలు

రఘునాథపాలెం: స్థానిక గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం సికెల్ సెల్ ఎనిమియా పరీక్షల ప్రత్యేక క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యులు, మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, మమత మెడికల్ కళాశాల జూనియర్ వైద్యులు సంయుక్తంగా రక్త పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు, జాగ్రత్తలు, ఆహార నియమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రమాదేవి, వైద్యులు అరుణ్‌కుమార్, ఉదయలక్ష్మి, శ్రీదేవి, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీకాంత్, రజిని, పాఠశాల నర్స్ నిర్మల, ప్రిన్సిపాల్ బాలస్వామి, ఉపాధ్యాయులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర హోం మంత్రి రాజీనామా చేయాలి



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్(మామిళ్లగూడెం): కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం దేశ ప్రతిష్టకు భంగం కలిగించడమేనని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం సీపీఎం ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి సరితాక్లినిక్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రధాని మోదీ కూడా అమిత్ షాను సమర్థించడం ఆక్షేపనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ సెక్రటరీ వై.విక్రమ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు యర్రా శ్రీనివాసరావు, జిల్లా నాయకులు బుగ్గవీటి సరళ, టి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా అమిత్‌షాను మంత్రివర్గం నుంచి ప్రధాని మోదీ బర్తరఫ్ చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా చైర్మన్ షేక్.నజీమా, జిల్లా కన్వీనర్ బానోత్ బద్రునాయక్, వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూక్యా ఉపేంద్రబాయి, భూక్యా జ్యోతి, జిల్లా ఉపాధ్యక్షురాలు త్రివేణిలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మం బీకేబజార్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశం, రాజ్యాంగం పట్ల గౌరవం ఉంటే అమిత్ షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని వారు హెచ్చరించారు.

ట్రాఫిక్ ఏసీపీకి వినతి



ఏసీపీకి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం బృందం

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని బైపాస్ రోడ్ నూతన బస్టాండ్ ఎదుట ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలని సీపీఎం ఖమ్మం డివిజన్ సెక్రటరీ వై.విక్రమ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ ఖమ్మం టూ టౌన్ కమిటీ ఆధ్వర్యాన ప్రతినిధి బృందం ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నూతన బస్టాండ్‌ను బైపాస్ రోడ్‌లో నిర్మించేటప్పుడు తగిన ప్రణాళిక లేకుండా హడావుడిగా కట్టడడంతో గతకొద్ది కాలంలోనే ప్రమాదాలు జరిగి ఇద్దరు చనిపోయారన్నారు. కనీసం బైపాస్‌లో ఇక్కడొక బస్టాండ్ ఉందనే అవగాహన లేకపోవడంతో వాహనాలు వేగంగా వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జబ్బర్, పార్టీ టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు సీహెచ్.భద్రం, చిన్న హుస్సేన్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు

ఖమ్మంమామిళ్లగూడెం(ఖమ్మం మామిళ్లగూడెం): నిత్యం కొత్త బస్టాండ్ వద్ద జరుగుతున్న ప్రమాదాలను అరికట్టాలని, అధికారుల నిర్లక్ష్యంతో ప్రాణాలు కోల్పోతున్నారని సీపీఐ ప్రతినిధి బృందం ఆందోళన వ్యక్తం చేసింది. ఈమేరకు శుక్రవారం కొత్తబస్టాండ్ నుంచి బ్రిడ్జి వరకు బృందం సందర్శించింది. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మొహమ్మద్ సలాం మాట్లాడుతూ.. రోజురోజుకు బైపాస్ రోడ్డు షాపింగ్ మాల్స్, పార్టీ కార్యాలయాలు ఇతర ఫైనాన్స్ కంపెనీలు వెలస్తుండడంతో నిత్యం రద్దీగా ఉండి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. వీటి నియంత్రణకు బస్టాండవద్ద ట్రాఫిక్ సిగ్నల్స్, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసే దిశగా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్, జ్వాలా నర్సింహారావు, చానా, భూక్యా రవీందర్, ఎండీ రెహమాన్, రమణ తదితరులు పాల్గున్నారు.

నివాళి

ఖమ్మంలీగల్: సీనియర్ న్యాయవాది రమేష్‌కుమార్ తండ్రి శ్రీస్వామి గురునాథం(89) శుక్రవారం తెల్లవారుజామున పరమపదించారు. ఈనేపథ్యాన తన తండ్రి జ్ఞాపకార్థం ఖమ్మం కోర్టులో న్యాయవాదుల ఆరోగ్య రీత్యా జిమ్ ఏర్పాటుకు రమేష్‌కుమార్ ఆర్థిక సాయం అందజేశారు. న్యాయవాదుల పక్షాన బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు గురునాథం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

పరామర్శ

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): బీసీ గురుకులంలో ఎలుక కాటుకు గురై ఖమ్మం మమతా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మీభవానికీర్తనను శుక్రవారం జనసేన పార్టీ ఖమ్మం అసెంబ్లీ ఇన్‌చార్జ్ రామకృష్ణ పరామర్శించారు. ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేస్తూ గురుకులాల విద్యార్థులను అధ్వానంగా వదిలివేస్తున్నారని మండిపడ్డారు. ఆయన వెంట జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు బండారు రామకృష్ణ, బానోత్ దేవేందర్, సచ్చు శ్రవంత్, లింగాల పుల్లారావు, దుండుగుల నాగరాజు, నారపోగు ప్రభాకర్, గంజి ఉదయ్, రాకేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులకు సంఘీభావం



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): నగర కేంద్రంలోని నూతన కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగులు 10 రోజులుగా నిర్వహిస్తున్న సమ్మెకు ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంపూర్ణ మద్దతు తెలియజేసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, జిల్లా కార్యదర్శి ప్రవీణ్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బషీరుద్దీన్‌లు మాట్లాడుతూ.. కాంగ్రెస్ మేనిఫెస్టోలో సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని చెప్పి ఇప్పుడు నిరవధిక సమ్మె చేస్తున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. 18 ఏళ్లుగా వారు తక్కువ జీతాలకు పని చేస్తున్నారని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనం పెంచాలన్నారు. జిల్లాస్థాయిలో ఏపీఓ సిస్టం అనలిస్టు టెక్నికల్ పర్సనల్ ఆపరేటర్లు, డీఎంఎంటీ మెసేంజర్లు, మండలస్థాయిలో ఎమ్మెల్యే కోఆర్డినేటర్లు, డేటాఎంట్రీ ఆపరేటర్లు, స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో సీఆర్పీలుగా పాఠశాల స్థాయిలో ఎన్నో ప్రభుత్వ యంత్రాంగంలో పనిచేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఆరోగ్య కార్డులో మహిళలకు ప్రసూతి నెలపలు జీవిత బీమాలు ఇవ్వాలని, కేజీబీవీ విద్యాసంస్థల్లోని సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు చింతల రమేష్, డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు జక్కంపూడి కృష్ణ, ఎస్ఎఫ్ఐ నాయకులు మనోజ్, త్రినాథ్ ,ఉదయ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'మా భూములు మాకు ఇప్పించండి'



చెరువుమాధారంలో విచారణ చేస్తున్న ఎస్సై

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారంలో అసైన్డ్ భూములను ఆక్రమించారని దళితులు ఫిర్యాదు చేయడంతో అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. గ్రామంలో 18.26 ఎకరాల అసైన్డ్ భూమిని 16 మంది దళితులకు ప్రభుత్వం అందించగా.. ఆ భూమిలో గ్రామానికి చెందిన కొందరు అక్రమంగా సాగు చేసుకుంటున్నారని బాధిత దళితులు తహసీల్దార్, ఎస్సైకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎస్సై పి.సంతోష్ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. దళితులు వద్ద ఉన్న రికార్డులను పరిశీలించారు. ఈనేపథ్యాన ఆక్రమణ చెరలో ఉన్న అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకుని తమకు అప్పగించాలని బాధితులు కోరారు. ఈ సందర్భంగా బాధితుడు సూరేపల్లి శ్రీను మాట్లాడుతూ.. తమకు పట్టాలు ఉన్నప్పటికీ దౌర్జన్యంగా సాగు చేస్తున్నారని, మా భూములు మాకు అప్పగించకుంటే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

నేలకొండపల్లి: కూసుమంచి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల సాగర్ కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించి నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. మృతదేహం కోసం ఇప్పటి వరకు ఎవరూ రాకపోవడంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి అంత్యక్రియల కోసం అన్నం ఫౌండేషన్‌కు సమాచారం అందించారు. ఈ మేరకు ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం పోలీసులు, వైద్య అధికారుల సమక్షంలో మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని స్థానిక హిందు శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'ఇందిరమ్మ' సర్వే

ఖమ్మం అర్బన్: నగరంలోని 8వ డివిజన్ వైఎస్‌ఆర్ నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. ఈ నేపథ్యాన శుక్రవారం స్థానిక కార్పొరేటర్ లకావత్ సైదులునాయక్ సర్వే తీరును పరిశీలించి ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న ప్రతీ లబ్ధిదారుడికి సర్వే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్వే సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్



వైష్ణవికి కండువా కప్పుతున్న డీసీసీ అధ్యక్షుడు

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం 46వ డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి, తన భర్త ప్రసన్నకృష్ణతో కలిసి బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో వారికి డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మేయర్ పి.నీరజ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం వైష్ణవి మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సారథ్యాన సారథినగర్ బ్రిడ్జిని ప్రారంభించడం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. వీరితో పాటు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు తొగరు భాస్కర్, తొగరు రమేష్, షేక్ గౌస్‌పాషా కూడా కాంగ్రెస్‌లో చేరగా..నాయకులు ఎర్రం బాలగంగాధర తిలక్, షేక్ రజీబాయ్, పాలకుర్తి నాగేశ్వరరావు, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, కోసూరి రమేష్‌గౌడ్, వాలబోయిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శ్రీ గణేష్ టౌన్‌షిప్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని ఒకటో డివిజన్ పరిధిలో శ్రీ గణేష్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని 2025, 2026 ఏడాదికి గాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చాగంటి రవీంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడిగా యాకోబ్ పాషా, కార్యదర్శిగా రాయల శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా కె.ప్రకాశరావు, కోశాధికారిగా పి.మీరా ప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా ఇ.పద్మ, కె.అనిల్‌కుమార్, ఎస్.పార్వతి, ఎస్.పార్వతి, బి.శాంతిలక్ష్మి, గౌరవ సలహాదారుడిగా నిమన వెంకటరామయ్య, ఆర్గనైజేషన్ కార్యదర్శిగా టి.రాజు ఎన్నికయ్యారు. కాగా, టౌన్‌షిప్‌లోని సీసీ రోడ్లు 197 మీటర్ల పరిధిలో నిర్మించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యను కోరుతూ తీర్మానించారు.

మహాసభలను విజయవంతం చేయండి

నేలకొండపల్లి: ఈ నెల 28 నుంచి 30 వరకు నల్లగొండలో జరిగే టీఎస్‌యూటీఎఫ్ 6వ విద్యా, వైజ్ఞానిక రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు కోరారు. మండలకేంద్రంలో శుక్రవారం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం విద్యారంగ అభివృద్ధికి సంఘం చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తొర్తి గురవయ్య, రమేష్, మందడపు శ్రీనివాసరావు, వాణిశ్రీ, రాంబాబు, వేణు, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, ప్రతిమ, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

బస్సు జాతాను..

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): ఆశాలకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఈనెల 26న సీఐటీయూ ఆధ్వర్యాన ఖమ్మం వచ్చే బస్సుజాతాను జయప్రదం చేయాలని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పిన్నింటి రమ్య కోరారు. శుక్రవారం దీనికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ఆరోగ్య వ్యవస్థకు మూల స్తంభాలుగా పనిచేస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రూ.18వేల వేతనంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, అధికారుల వేధింపులు అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాలి వెంకటాద్రి, వేదగిరి మురారి, లక్ష్మి, విజయలక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

నోటికి 'చిక్క'కుండా..!

ప్లాస్టిక్ వస్తువుల వినియోగం నానాటికి పెరుగుతున్నా.. కొందరి వినూత్న ఆలోచనలకు హ్యాట్సాఫ్ చెప్పకతప్పదం లేదు. వాడి పాడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను ఏదో ఒక రూపంలో వినియోగంలోకి తీసుకొస్తూ తమ టాలెంట్‌ను చూపిస్తున్నారు. ఈనేపథ్యాన మండలంలోని రుక్కితండా జీపీకి చెందిన బండిపాడు గ్రామానికి చెందిన తిమ్మెట్ల వెంకన్న అనే రైతు తనకున్న 12 మేకలకు ప్లాస్టిక్ బాటిళ్లతో చిక్కాలు తయారు చేశాడు. ఇతడు తన మేకలను మేత కోసం నిత్యం పంట చేల మధ్య ఉన్న దారిలో వెళ్లాల్సి ఉంటుంది. ఈక్రమంలో దారికి ఇరువైపులా ఉన్న పంటలను తినకుండా ఉండాలని ఇలా ఖాళీ కూల్ డ్రింక్ బాటిళ్లను సగానికి కోసి చిక్కాలుగా తగిలించాడు. రూపాయి ఖర్చు లేకుండా, పంటలు నష్టపోకుండా ఉంటుందని రైతు తెలిపాడు. – కామేపల్లి



మేకల మూతికి ప్లాస్టిక్ బాటిళ్ల చిక్కాలు